సాక్షి
ప్రకాశం
మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



ఇంటి ముంగిట సంజీవని

వివిధ రకాల పూలు, అలంకరణ మొక్కలతో పాటు ఔషధ మొక్కలు కూడా నర్సరీల్లో దర్శనమిస్తున్నాయి. ఇళ్లలో వీటి పెంపకంపై ఆసక్తి పెరుగుతోంది. - IIలో..



నిజాయితీగా విధులు నిర్వహిస్తాం

అవినీతికి దూరంగా ఉంటామని, నీతి నిజాయితీతో జీవిస్తామని పోలీసు అధికారులు, డీపీవో సిబ్బందితో ఏఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
30.2/26.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 6,8 తేదీల్లో సామాజిక సాధికార బస్సు యాత్ర

ఒంగోలు: జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో సామాజిక సాధికార బస్సు యాత్ర ఈనెల 6, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ మార్కాపురంలో, 8వ తేదీ కనిగిరిలో ఈ బస్సు యాత్ర ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నవంబరు 1న ఒంగోలులో తన కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు అందుబాటులో ఉంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 68వ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పమాలాలంకరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం స్పందన సమావేశ మందిరంలో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసే కార్యక్రమంలో పాల్గొంటారు. 11.30 గంటలకు మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి నిర్వహించే నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 8 గంటలకు ఒంగోలులో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: నవంబర్ 1వ తేదీ జరిగే 68వ ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో సోమవారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సీవీఎన్ రీడింగ్ రూము సమీపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాలంకరణ, కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ, అనంతరం స్పందన హాలులో సాంస్కృతిక వేడుకల ఇతర కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేయాలన్నారు. కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రముఖులకు ఆహ్వాన పత్రాలు పంపాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ అశోక్‌బాబు, ఆర్డీఓ విశ్వేశ్వర రావు, డీఎస్‌ఓ ఉదయభాస్కర్, డీఈఓ సుబ్బారావు, మెప్మా పీడీ రవికుమార్, డీఐపీఆర్‌ఓ గ్రేస్ లినోర ఇతర అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా ఎఫ్ఎల్‌సీ

- ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్



ఈవీఎం గోదాము వద్ద రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: రాబోయే ఎన్నికల్లో వినియోగించేందుకు కొత్తగా జిల్లాకు వచ్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్‌చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) పక్కాగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదామును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎఫ్ఎల్‌సీ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఎల్‌సీ పూర్తయిన ఈవీఎంలను మరో గోదాములో సురక్షితంగా భద్రపరుస్తున్నామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగే ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ పూర్తయిందని సోమవారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ నవంబర్ 10వ తేదీ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. గోదాము వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రాంగణంలోకి అనుమతించడం లేదన్నారు. కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు ఉన్నారు.

మత్తు డాక్టర్.. ప్రకృతికి జై కొట్టి..!



డాక్టర్ యాతం కొండారెడ్డి

- విదేశాల్లో స్థిరపడిన డాక్టర్ యాతం కొండారెడ్డి
- రైతు బిడ్డగా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి
- కొండ బండలను పిండిచేసి వ్యవసాయ భూమిగా మార్పు
- 55 ఎకరాల్లో సాగు..
- అందుబాటులో అన్ని వనరులూ
- ప్రతి రోజు 50 నుంచి 100 మందికి ఉపాధి

ఆయనో మత్తు డాక్టర్..విదేశాల్లో స్థిరపడ్డారు. వ్యవసాయం అంటే ప్రాణం. ఉద్యోగ విరమణ తర్వాత తన ప్రాంతంలో బీడు భూముల్లో కొండ బండలను చదును చేసి సాగుభూములుగా మార్చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రత్నాలు పండిస్తున్నారు. ఆరోగ్యదాయకమైన పంటలు సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు తాళ్లూరు మండలానికి చెందిన డాక్టర్ యాతం కొండారెడ్డి. 55 ఎకరాల్లో పండ్ల తోటలు, కూరగాయలు పండిస్తున్నారు.

ఏపీ నెట్‌వర్క్

తాళ్లూరు మండలం రామభద్రపురానికి చెందిన యాతం కొండారెడ్డి కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అక్కడే మత్తు వైద్యునిగా ప్రాక్టీస్ మొదలు పెట్టారు. ఆ తర్వాత కేరళ, ఢిల్లీల్లో పని చేశారు. 1990వ సంవత్సరం మార్చిలో విదేశాలకు వెళ్లారు. ఇరాన్, మలేసియా, న్యూజిలాండ్ దేశాల్లో మత్తు వైద్యునిగా పనిచేశారు. అనంతరం ఆస్ట్రేలియాకి వెళ్లి అక్కడ 22 సంవత్సరాల పాటు వైద్య వృత్తిని కొనసాగిస్తూ స్థిరపడ్డారు. రైతు కుటుంబం కావడంతో వ్యవసాయం అంటే ప్రాణం. సొంత నియోజకవర్గంలో వ్యవసాయం చేయాలని నిశ్చయించుకున్నారు. రసాయనాలకు దూరంగా ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయం చేయాలని భావించారు. అంతే తన తమ్ముడి అల్లుడు గోపు శ్రీనివాసరెడ్డిని సంప్రదించారు. ఆయన సాయంతో దర్శి పట్టణానికి సమీపం బొట్లవానిపాలెంలో 55 ఎకరాల బీడు భూమిని కొనుగోలు చేశారు. పొలంలో ఉన్న బండలను తొలగించి చదును చేయించారు. ఆరోగ్యదాయకమైన ప్రకృతి పంటల సాగు మొదలు పెట్టారు. సాగర్ కాలువకు ఇరువైపులా ఉన్న ఈ పొలం చివరి ఆయకట్టు కావడంతో నీటి వనరులు చాలా తక్కువగా అందుబాటులో ఉంటాయి. దీంతో పొలంలో 14 బోర్లు వేయించారు. బోర్లలో నీరు అడుగంటకుండా వాన నీటితో రీచార్జ్ అయ్యేలా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌లు ఏర్పాట్లు చేశారు. అలాగే డ్రిప్‌ను సైతం అందుబాటులోకి తెచ్చారు. భూసార పరీక్షలు చేయించి సాగు మొదలు పెట్టారు.



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొలాలు



షేడ్‌నెట్‌లో వేసిన టమాటా

ప్రభుత్వ సబ్సిడీతో ఫారం పాండ్, షేడ్‌నెట్‌లు:

రూ.20 లక్షల ప్రభుత్వ సబ్సిడీతో స్టోరేజీ ట్యాంకును నిర్మించారు. ఒకసారి నింపితే డ్రిప్ ద్వారా 55 ఎకరాలకు ఒక సంవత్సరానికి సరిపడా నీటిని నిల్వ ఉంచేలా 100 105 మీటర్ల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేశారు. పొలం మొత్తానికి పైప్ లైన్‌ల ద్వారా నీరు సరఫరా అవుతుంది.

అంతా ప్రకృతి వ్యవసాయమే:

17 ఆవులు, దూడలతో ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తున్నారు. వీటిలో ఏడు ఒంగోలు నాటు ఆవులు, మూడు సాహివాలా, రెండు రెడ్‌సింధి, ఐదు దూడలను పోషిస్తున్నారు. వాటి పోషణకు నాలుగు రకాల గడ్డి దాణాలు అక్కడే పెంచి వాటిని యంత్రాల్లో మిక్స్ చేసి అందిస్తున్నారు. ఆవు మూత్రం, ఆవు పేడతో ఉపయోగించే కషాయాలు తయారీకి యంత్రాలను ఏర్పాటు చేశారు. ఆవు పాలతో పులిసిన మజ్జిగ ద్రావణాలు, ఆవు పేడ, మూత్రంతో జీవామృతం, ఇతర కాషాయాలైన పచ్చిమిర్చి, వెల్లుల్లి కషాయం, బ్రహ్మాస్త్రం, వేపనూనె, సీవీఆర్ మట్టిద్రావణం, నాటు ఆవుపాలు, 15 రోజులకు ఒక సారి పంటల మొత్తానికి స్ప్రే చేస్తారు. అలాగే చేపలను కూడా పెంచి దానికి సంబంధించి దాణా కూడా అక్కడే యంత్రాల ద్వారా తయారు చేసి ఫీడింగ్ ఇస్తున్నారు. నీటి మోటర్లకు విద్యుత్‌తో పాటు కొన్ని బోర్లకు సోలార్ విద్యుత్ ఏర్పాట్లు కూడా చేశారు. అలాగే రెండు షేడ్ నెట్‌లు కూడా ఏర్పాటు చేసి ఎటువంటి పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తున్నారు.



సంవత్సరానికి సరిపడా నీరు నిల్వ ఉండేలా ఏర్పాటు చేసిన ఫారం పాండ్



చేపల మేత, ఆవుల మేత కోసం తీసుకొచ్చిన నూతన యంత్రాలు

50 నుంచి 100 మందికి ఉపాధి..

30 మంది నెల జీతం తీసుకునే వారు ఇక్కడ పని చేస్తున్నారు. వారు కాకుండా ప్రతి రోజు 50 నుంచి 100 మంది కూలీలకు పని కల్పిస్తున్నారు. పొలంలో పని చేసేందుకు ఒక ప్రొక్లెయిన్, నాలుగు ట్రాక్టర్లు, సరుకు రవాణా లారీ, పొలంలో తిరిగేందుకు ఎలక్ట్రానిక్ బైక్ వాహనాలు సమకూర్చారు. ప్రస్తుతం గోపు శ్రీనివాసరెడ్డి దగ్గరుండి పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



ముప్పై ఏళ్లుగా వైద్య వృత్తిలో ఎంతో మంది అనారోగ్యం పాలవుతున్న వారిని చూశా. ఏరోగానికైనా నా తినే ఆహారమే మూల కారణం. నాది వ్యవసాయ కుటుంబం. ఎంత డబ్బు సంపాదించినా ఆరోగ్యకరమైన తిండి లేకపోతే మానవ జీవితానికి మనుగడ ఉండదు. అందుకే ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించాలని అనుకున్నా. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం అప్పుడప్పుడూ వచ్చి వెళుతున్నా. రెండేళ్ల తర్వాత ఇక్కడికే వచ్చేస్తా.

– డాక్టర్ యాతం కొండారెడ్డి

అన్నీ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నా



మా పెద్దాయన ఆస్ట్రేలియా నుంచి నిత్యం అన్నీ పర్యవేక్షిస్తుంటారు. ఆయన సూచించిన విధంగా పంటలు పండిస్తున్నా. ఏ అవసరం అయినా డబ్బు పంపుతారు. అంతా ప్రకృతి వ్యవసాయం ద్వారానే చేస్తున్నాం. అన్నీ రకాల యంత్రాలు అందుబాటులోకి తీసుకొచ్చాం. పంటలకు అవసరమైన కషాయాలన్నీ ఇక్కడే తయారు చేస్తున్నాం. ఏ అవసరం అయినా బయటకు వెళ్లాల్సిన పని లేదు.

– గోపు శ్రీనివాసరెడ్డి, గంగవరం

సాగు చేస్తున్న పంటలు..

మొత్తం 35,000 పండ్ల మొక్కలు సాగు చేస్తున్నారు. 26 ఎకరాల్లో 8 రకాల మామిడి (మల్లిక, దశేరి, బంగినపల్లి, పునారస, కేసరి, చిన్నరసాలు, పెద్దరసాలు) రెండున్నర ఎకరాల్లో నిమ్మ, మూడు ఎకరాల్లో సీతాఫలం, రెండున్నర ఎకరాల్లో అవకాడో, రెండు ఎకరాల్లో బత్తాయి అంతర పంటగా మునగ, అర ఎకరంలో రోజాపూలు, రెండు ఎకరాల్లో బీర, రెండున్నర ఎకరాల్లో కాకర అంతర పంటగా బీన్స్, షేడ్ నెట్‌లలో మిరప, టమాటాలను పండిస్తున్నారు. అలాగే చామంతి, బంతి, రోజా పూలు, అన్నీ రకాల పండ్ల మొక్కలు 10, 20 చెట్లు వేసి వాటి పెరుగుదల గమనిస్తూ ఉన్నారు. బోర్డర్‌లో వక్క, మహాగని, మలబార్ వేప, వెదురు, కొబ్బరి మొక్కలు నాటారు. తేనె, పుట్టగొడుగుల పెంపకానికి సిద్ధం చేశారు. పొలం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ వేశారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- 19 రోడ్లకు పరిపాలనా అనుమతులిచ్చిన ప్రభుత్వం
- మంజూరైన రూ.83.89 కోట్లు
- రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



యర్రగొండపాలెం: జిల్లాలోని గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి వరకు అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు బాగుపడ్డాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు సీసీ రోడ్లుగా దర్శనమిస్తున్నాయి. తాజాగా పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కింద ప్రభుత్వం జిల్లాలోని 19 గ్రామీణ రోడ్లకు అడ్మిస్ట్రేషన్ శాక్షన్ మంజూరు చేసింది. అందుకు గాను రూ.83.89 కోట్లు కేటాయించిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు యర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దదోర్నాల మండలంలోని పెద్దబొమ్మలాపురం నుంచి ముంతకనుమకురువ మీదుగా దోర్నాల కేజీ రోడ్డు వరకు 5.60 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ.3.90 కోట్లు, పెద్దారవీడు మండలంలోని మద్దెలకట్ట నుంచి చాట్లమడ అగ్రహారం వరకు 2.10 కిలోమీటర్ల రోడ్డుకుగాను రూ.1.50 కోట్లు, పుల్లలచెరువు మండలంలోని అక్కపాలెం నుంచి మర్రివేముల ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు 3.45 కిలో మీటర్లకుగాను రూ.4.10 కోట్లు, యర్రగొండపాలెం మండలంలోని కొత్తగోళ్లవిడిపి నుంచి పాతగోళ్లవిడిపి మీదుగా వైటీ రోడ్డు వరకు 3.70 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.25 కోట్లు, త్రిపురాంతకం మండలంలోని కేజీ రోడ్డు నుంచి ఎండూరివారిపాలెం 1.70 కిలో మీటర్ల రోడ్డుకు రూ.1.25 కోట్లు మంజూరయ్యాయి. మార్కాపురం నియోజకవర్గంలోని బిరుదులనరవ నుంచి తిప్పాయపాలెం మీదుగా బొడిచెర్ల వరకు 7.25 కిలోమీటర్ల రోడ్డుకు రూ.7 కోట్లు, మార్కాపురం-కంభం రోడ్డు నుంచి కొత్తపల్లి మీదుగా చింతకుంట రోడ్డుకు 4.575 కిలో మీటర్లకు గాను రూ.2.22 కోట్లు, గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు మండలంలోని రంగాపురం నుంచి అర్ధవీడు వరకు రోడ్డుకు 12 కిలోమీటర్లకుగాను రూ.25 కోట్లు, గిద్దలూరు మండలంలోని నరవ నుంచి కొంగలవీడు రోడ్డుకు 3.60 కిలో మీటర్లకుగాను రూ.3.20 కోట్లు, కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని అనమలకొండ నుంచి కందులవారిపాలెం వరకు 3 కిలోమీటర్ల రోడ్డుకు రూ.3.10 కోట్లు, కొండపి నియోజకవర్గం టంగుటూరు మండలంలోని వెలగపూడి నుంచి అనంతవరం మీదుగా అలకూరపాడు వరకు 5.50 కిలోమీటర్లకు గాను రూ. 4.05 కోట్లు, జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడు-జమ్ములపాలెం రోడ్డుకు 2.60 కిలో మీటర్లకుగాను రూ.2.75 కోట్లు, పొన్నలూరు మండలంలోని చెరుకూరు-చౌటపాలెం వరకు రోడ్డుకు 4.20 కిలో మీటర్లకుగాను రూ.3.45 కోట్లు, మర్రిపూడి మండలంలోని మర్రిపూడి-యానాదిపాలెం రోడ్డుకు 10.80 కిలో మీటర్లకుగాను రూ.8.50 కోట్లు మంజూరయ్యాయి. దర్శి నియోజకవర్గం తాళ్లూరు మండలంలోని నాగంభొట్లపాలెం-లక్కవరం రోడ్డుకు 3 కిలోమీటర్లకుగాను రూ.2 కోట్లు, ముండ్లమూరు మండలంలోని చింతలపూడి-ఉమామహేశ్వరపురం రోడ్డుకు 3.20 కిలోమీటర్లకుగాను రూ.3 కోట్లు, ఒంగోలు నియోజకవర్గం కొత్తపట్నం మండలంలోని మోటుమాల-గుండమాల రోడ్డుకు 1.60 కిలో మీటర్లకుగాను రూ.75 లక్షలు, సంతనూతలపాడు నియోజకవర్గం మద్దిపాడు మండలంలోని గుంటూరు హైవే రోడ్డు నుంచి గుండ్లకమ్మ గ్రామం మీదుగా గుండ్లపల్లి వరకు రోడ్డుకు 3.50 కిలోమీటర్లకుగాను రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి.

ప్రజా సమస్యలు నిర్ణీత గడువులో పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

- స్పందన నిర్వహించిన కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యలు నిర్దేశించిన గడువులోగా క్షేత్ర స్థాయిలో చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఉమాదేవి, గ్లోరియా, లోకేశ్వరరావు, వరకుమార్ పాల్గొన్నారు.

- జరుగుమల్లి మండలం వాలేటిపాడు గ్రామానికి చెందిన వెంకాయమ్మ సర్వే నంబర్166లో ఎస్సీ కాలనీకి స్థలాన్ని కేటాయించారని అయితే విస్తీర్ణంలో తేడా ఉందని తెలిపారు. పరిశీలించి వెంటనే సరిచేసి న్యాయం చేయాలని కోరారు.
- యర్రగొండపాలెం మండలం నర్సాయపాలేనికి చెందిన పెద మంత్రయ్య స్పందనలో కలెక్టర్‌ను కలిసి తనకు క్రాప్ రుణం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశాడు. యూనియన్ బ్యాంకు తనకు పాస్ పుస్తకం, ఇతర అన్నీ ఉన్నా రుణం ఇవ్వకుండా ఉన్నారని పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశాడు.

చికిత్స కోసం జీజీహెచ్‌కు వస్తే... ప్రైవేటు వైద్యశాలలో ఆపరేషన్ !



బాధితురాలు శివపార్వతి

ఒంగోలు టౌన్: ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స కోసం వస్తే మాయమాటలు చెప్పి ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ఆపరేషన్ చేసినా నొప్పి తగ్గక బాధపడుతుంటే తిరిగి అదే ప్రభుత్వ వైద్యశాలకు తెచ్చి వైద్యం చేశారు. ఒంగోలు జీజీహెచ్ వైద్యుల మీద చిలకలూరిపేటకు చెందిన మహిళ ఒకరు సోమవారం స్పందనలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటపడింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా చిలకలూరిపేట రాగన్నపాలెం గ్రామానికి చెందిన బల్లిపల్లి శివపార్వతి కొద్దిరోజులుగా నడుమునొప్పితో బాధపడుతోంది. స్థానిక ఆస్పత్రిలో చూపించుకోగా ఆపరేషన్ చేసి రాడ్ వేయాలని చెప్పారు. దాంతో చికిత్స కోసం ఆమె ఒంగోలు జీజీహెచ్‌కు వచ్చారు. న్యూరాలజీ విభాగానికి చెందిన వైద్యుడు గోపీకృష్ణ వద్దకు వెళ్లారు. అయితే అక్కడ పనిచేసే కాంపౌండరు ప్రభుత్వ వైద్యశాలలో రాడ్లు వేస్తే ఇన్‌ఫెక్షన్లు వస్తాయని చెప్పి భయపెట్టాడు. జీజీహెచ్‌లో పనిచేసే డాక్టర్ గోపీకృష్ణ బయట ప్రైవేటు వైద్యశాలలో కూడా చికిత్స చేస్తారని, అక్కడైతే ట్రీట్‌మెంట్ బాగుంటుందని చెప్పాడు. ప్రైవేటు వైద్యశాలలో ఆపరేషన్ చేయించుకునేందుకు డబ్బులు లేవని శివపార్వతి చెప్పగా తాను మాట్లాడి తక్కువ ఖర్చుకే ఆపరేషన్ చేయిస్తానని నమ్మబలికాడు. దాంతో రూ.65 వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకొని బయట సాయి బాలాజీ వైద్యశాలలో ఆపరేషన్ చేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా నడుము నొప్పి మాత్రం తగ్గలేదు. మరింత ఎక్కువగా నడుము నరాలు లాగడం మొదలు పెట్టాయి. సరిగా లేచి నిలబడలేకపోయే పరిస్థితి వచ్చింది. దీంతో ఆందోళనకు గురైన శివపార్వతి వెంటనే డాక్టరు గోపీకృష్ణను సంప్రదించారు. నొప్పి తగ్గుతుందని చెప్పి మందులు రాసి పంపించారు. నొప్పి తగ్గకపోవడంతో మరోసారి డాక్టర్‌ను కలిసి సమస్య చెప్పగా ఆమెను ఒంగోలు జీజీహెచ్‌లో అడ్మిట్ చేసి 15 రోజులు చికిత్స చేశారు. అయినా నొప్పి తగ్గకపోవడంతో అనుమానం వచ్చి మంగళగిరి మణిపాల్ వైద్యశాలకు వెళ్లి చూపించుకోగా చేసిన ఆపరేషన్ ఫెయిల్ అయిందని, అందుకే నొప్పి తగ్గలేదని చెప్పారు. మళ్లీ ఆపరేషన్ చేయాలని చెప్పడంతో తప్పనిసరి పరిస్థితిలో తిరిగి ఆపరేషన్ చేయించుకున్నారు. అయితే ఆరోగ్య శ్రీలో ఆపరేషన్ చేయడంతో బతికిపోయామని శివపార్వతి భర్త వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయకుండా ప్రైవేటు వైద్యశాలకు తరలించడమే కాకుండా తనకు చేసిన చికిత్సకు సంబంధించి డిశ్చార్జి సమ్మరి ఇవ్వకుండా డాక్టర్ గోపీకృష్ణ ఇబ్బంది పెడుతున్నారని, ఆయన చేసిన ఆపరేషన్ ఫెయిల్ కావడంతో రూ.5 లక్షలు నష్టపోయానని తనకు న్యాయం చేయాలని శివపార్వతి కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. డాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిజానిజాలను విచారణ జరిపించి బాధితురాలికి న్యాయం చేకూర్చాల్సిందిగా కలెక్టర్ జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్‌ను ఆదేశించారు.

ప్రతి పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం

- నాడు-నేడు ద్వారా పాఠశాలలన్నీ అభివృద్ధి
- కార్పొరేట్ స్థాయి విద్య ప్రభుత్వ బడుల్లోనే..
- జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పెడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకాయమ్మ

దర్శి: రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్యకరమైన మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందిస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మండలంలోని తూర్పు చౌటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం వెంకాయమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలా చదువుతున్నారు? అధ్యాపక సిబ్బంది సరిగా వస్తున్నారా? పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయా? జగనన్న విద్యా కానుక అందిందా? ఆహారం ఉచితంగా ఉంటుందా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి వారితో కలసి కూర్చుని భోజనం చేశారు. శామంతపూడి గ్రామానికి చెందిన 40 మంది విద్యార్థులు బస్ సౌకర్యం లేక నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తుందని బస్ వేయించాలని కోరగా వెంటనే శామంతపూడి నుంచి బస్‌వేయాలని ఆర్టీసీ ఆర్ఎంతో ఫోన్‌లో మాట్లాడి చెప్పారు. పాఠశాల గ్రౌండ్ చివర భూమిని శ్మశానంగా వాడుకుంటున్నారని, దీంతో పిల్లలు ఆడుకోవాలంటే భయపడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ సచివాలయ సిబ్బంది తమకు సీసీరోడ్డు వేయాలని వినతి పత్రం అందజేశారు. త్వరలోనే సీసీ రోడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకయమ్మ మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టి పేదలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య ,రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జాతీయ ఐక్యతా దినోత్సవం

ఒంగోలు సిటీ: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డీపీఓ జీవీ నారాయణరెడ్డి సూచించారు. భారత స్వాతంత్ర్య యోధులు, జాతీయ నాయకులు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా అక్టోబరు 31న 'జాతీయ ఐక్యతా దినోత్సవం' నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులతో కలిసి సచివాలయ కార్యదర్శులు, ఇతర సిబ్బంది, వలంటీర్లు 'ఐక్యతా ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. యూనిటీ రన్‌లో పాల్గొనాలని జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారులను ఆదేశించారు.

బాలికను అపహరించిన నిందితుడు అరెస్టు

హనుమంతునిపాడు: పదమూడేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి వెంట తీసుకెళ్లిన నిందితుడిని కనిగిరిలోని సోమవారం అరెస్టు చేసినట్లు హనుమంతునిపాడు ఎస్సై కె.శివనాగరాజు తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. హనుమంతునిపాడులో ఎస్టీ సామాజికవర్గానికి చెందిన బాలిక(13) ఈ నెల 22 నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బాలిక ఆచూకీ తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను వెంటబెట్టుకుని ఈ నెల 28న పోలీసు స్టేషన్‌కు రాగా మహిళా ఎస్సైతో విచారించారు. బాలిక వాంగ్మూలం మేరకు కనిగిరి మండలం నేలటూరు గొల్లపల్లి గ్రామానికి చెందిన గురునాథం దానియేలుపై పోక్సో నమోదు చేశారు. నిందితుడు కనిగిరిలో ఉన్నట్లు సమాచారం తెలియడంతో డీఎస్పీ ఆధ్వర్యంలోని ప్రత్యేక పోలీసు బృందం అరెస్టు చేసినట్లు ఎస్సై వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి



వెంకటయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీహరి

పుల్లలచెరువు: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన పుల్లలచెరువు మండలంలోని తెల్లగట్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. తెల్లగట్ల గ్రామానికి చెందిన మోరబోయిన చిన్న వెంకటయ్య(69) గ్రామంలోని పశువులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తెల్లగట్ల నుంచి శతకోడు వెళ్లే రహదారి వెంట పొలాల్లో వెంకటయ్య స్పృహ తప్పి పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న వారు చూసి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వెంకటయ్య మోకాలికి గాయమై ఉంది. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు.

రజకుల సంక్షేమంపై విషం చిమ్ముతారా?



నిరసన తెలుపుతున్న రజక సంఘ నాయకులు

కనిగిరి రూరల్: 'రజక సంక్షేమ సంఘ భవన్, విద్యాభవన్‌ను తామంతా కలిసి నిర్మించుకుంటూ.. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్‌ను శంకుస్థాపనకు పిలిచాం. దాన్ని జీర్ణించుకోలేని కొందరు నేతలు వారి అనుకూల పచ్చ పత్రికల్లో విషపు రాతలు రాయించారు. తమ కులానికి నష్టం కలిగించేలా చేస్తున్న ఆ పార్టీ నేతలకు తగిన రీతిలో బుద్ధి చెబుతాం' అని రజక సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు దేవూరి వెంకటేశ్వర్లు, నాయకులు సుబ్బారావు తీవ్రంగా మండిపడ్డారు. ఈనాడు, తోక పత్రికలో వాస్తవాలను వక్రీకరించి ప్రచురించిన కథనాలను సోమవారం కనిగిరిలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఖండించారు. పట్టణంలోని రజక సంక్షేమ సంఘ భవన్(మాచర్ల వెంగయ్య భవన్)ను సమష్టిగా నిర్మించుకుంటున్నట్లు చెప్పారు. పట్టణంలోని సర్వే నెంబర్ 444లో గల కొంత స్థలాన్ని 1961 మల్లెల జాన్ మార్కస్ వద్ద నుంచి మాచర్ల వెంగయ్య కొనుగోలు చేసి కొంత మంది ఎస్టీలకు ఇళ్లు కట్టాంచారని వివరించారు. దానిలో కొంత స్థలాన్ని ప్రజా అవసరాల దృష్ట్యా బావికి వదిలి పెట్టారని చెప్పారు. ఆ స్థలంలో మాచర్ల వెంగయ్య భవన్ (రజక సంక్షేమ సంఘ భవన్) నిర్మించుకునేందుకు 20 ఏళ్ల క్రితం అప్పటి కనిగిరి సర్పంచ్ సుగుణావతమ్మతో శంకుస్థాపన చేయించామన్నారు. కొందరు టీడీపీ నేతలు, ఆక్రమణ దారులు ఆ స్థలంపై కన్ను వేసి, గత టీడీపీ హయంలో కబ్జాకు ప్రయత్నించగా తాము కాపాడుకున్నామన్నారు. కోర్టులో మున్సిపాలిటీకి అనుకూలంగా తీర్పు రావడంతో తమ విన్నపం మేరకు రజక సంక్షేమ భవన్ నిర్మాణానికి కేటాయించారన్నారు. ఇందులో ఎమ్మెల్యే బుర్రా, చైర్మన్ గఫార్ స్వార్థం ఏముందని టీడీపీ నేతలను, ఎల్లో మీడియాను ప్రశ్నించారు. అసత్య కథనాలు అచ్చువేసిన ఆ రెండు పత్రికలపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వి.కొండయ్య, తిరుపతయ్య, బి.బాలయ్య, రంగనాయకులు, సాయి ప్రతాప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటి ముంగిట సంజీవని

ఉరుకులు..పరుగుల జీవితం.. క్షణం తీరికలేని సమయం.. ఉన్నత జీవనం అందుకునే క్రమంలో ఆరోగ్యం కాపాడుకునేందుకు మందులు వాడుతున్నాం.. అయితే ప్రకృతి మనకు అందిస్తున్న అద్భుతాల్లో ఔషధ మొక్కలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. రోగనిరోధక శక్తిని పెంచేలా ఎన్నో రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. తక్కువ విస్తీర్ణంలో వీటిని పెంచుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఇప్పుడిప్పుడే వీటిపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. నిన్న మొన్నటి వరకూ ఇళ్లల్లో అందం కోసం పెంచుకునే మొక్కల స్థానంలో ఇవి వచ్చి చేరుతున్నాయి. అవి ఏంటి.. వాటి ద్వారా ఉపయోగాలు ఏమిటో తెలుసుకుందామా మరి..

– ఒంగోలు డెస్క్



పెళ్లూరు చెరువు సమీపంలో జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న నర్సరీ

నర్సరీల్లో మనకు ఎక్కువగా వివిధ రకాల పూల మొక్కలు.. ఇళ్లల్లో సరికొత్త అందాలనిచ్చే మొక్కలు.. ఉద్యానవన పంటలకు సంబంధించిన మొక్కలు కనిపిస్తుంటాయి. మారుతున్న కాలంలో వీటితోపాటు ప్రకృతి మనకు అందిస్తున్న ఔషధ మొక్కలు కూడా నర్సరీల్లో దర్శనమిస్తున్నాయి. మనం ఏ ఇంట్లో చూసినా బీపీ, షుగర్, ఊబకాయం ..ఇలా వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారు ఎక్కువగా కనపడతారు. వీరి కోసం ప్రత్యేకంగా ఔషధ మొక్కలు ఉన్నాయి. అలాగే వాతావరణ కాలుష్యం నుంచి రక్షించి ఆక్సిజన్ పెంపొందించే మొక్కలూ అందుబాటులోకి వస్తున్నాయి. అంతే కాదు పలు సుగంధ మొక్కలు సైతం విరివిగా లభిస్తున్నాయి. వీటిని అతి తక్కువ విస్తీర్ణంలో ఇళ్లలోనే పెంచుకోవచ్చు. ఒకప్పుడు పెద్ద పెద్ద నగరాల్లో మాత్రమే వీటిని విక్రయించేవారు. డిమాండ్ పెరగడంతో నగరంలోని కొన్ని నర్సరీల యజమానులు తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర ఇలా పలు ప్రాంతాల నుంచి ఔషధ, సుగంధ మొక్కలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పెళ్లూరు చెరువు సమీపంలో శివసాయి నర్సరీకి వెళితే దాదాపు 20 రకాల ఔషధ మొక్కలు, సుగంధ మొక్కలు కనిపించాయి. అవి మనకు చేసే మేలును పరిశీలిద్దాం..



కుందేటి కొమ్ము: ఊబకాయం..పొట్ట, పులిపిర్లు తగ్గేందుకు చాలా ఉపయోగపడుతుంది. ఆకు రసాన్ని పులిపిర్లపై రాస్తే అవి తగ్గిపోతాయి. ఆకుని తినడం ద్వారా పొట్ట క్రమంగా తగ్గుతుంది. దీనిని వెంకటేశ్వర వ్యవసాయ విశ్వ విద్యాలయం (తిరుపతి) నుంచి తీసుకొచ్చారు.



పొదపత్రి: ఇది షుగర్‌ను తగ్గిస్తుంది. సన్నజాజి పూల మొక్కను పోలి ఉంటుంది. రోజూ మూడు ఆకులు తింటే ఒంట్లో షుగర్ లెవల్స్ తగ్గుతూ వస్తాయి. దీనిని కోయంబత్తూరు నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.

ఆల్‌స్పైసెస్: ఇది మసాలా దినుసులకు ప్రత్యామ్నాయంగా వంటల్లో వాడుకోవచ్చు. కూరల్లో మూడు ఆకులు వేస్తే మసాలా ఘుమఘుమలు అదిరిపోతాయి.





వక్క : వక్కలను మనం ప్రధానంగా కిళ్లీలు తయారీలో వినియోగిస్తాం. అలాగే దైవ కార్యక్రమాల్లో సైతం దీనిని వాడుతాం.

జేడ్ (ఇండోర్ ఆక్సిజన్ ప్లాంట్): కాలుష్యం పెరిగిపోతున్న తరుణంలో వీటిని ఇంట్లో పెట్టుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ మొక్కల నుంచి విడుదలయ్యే ఆక్సిజన్ మనకు ఎంతో ఉపయోగపడుతుంది. దీనిని తమిళనాడు నుంచి తీసుకొచ్చారు.



తెల్ల ఈశ్వరి: ఈ మొక్క పాములను ఇళ్లలోకి రాకుండా చేస్తుంది. దీని నుంచి వచ్చే వాసనకు పాములు దూరంగా వెళ్లిపోతాయి. కోయంబత్తూరు నుంచి తెచ్చారు.



నల్లవాయిల: ఈ మొక్క పది రకాల వ్యాధులు నయం చేసేందుకు ఉపయోగపడుతుంది. వేడి, సెగ్గడ్డలు, కాళ్ల పగుళ్లు ఇలా పలు రకాల వ్యాధుల తీవ్రతను తగ్గిస్తాయి.



కొండపిండి ఆకు: ఈ మొక్కలు ఎక్కడైనా విరివిగా లభిస్తాయి. కిడ్నీలో రాళ్లతో బాధపడే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. వీటి ఆకు రసం, లేదా పిండిని తీసుకుంటే రాళ్లు కరిగి బయటకు వచ్చేస్తాయి. ప్రధాన ఆయుర్వేద మందుల దుకాణంలో దీని పొడి లభ్యమవుతుంది.



నన్నారి: ఒంట్లో వేడిని తగ్గిస్తుంది. వేసవి కాలంలో చాలా మంది నన్నారి జ్యూస్ తాగుతారు. అన్ని జ్యూస్ దుకాణాల్లో ఇది కనిపిస్తుంది. సంవత్సరంలోనే ఇది అందుబాటులోకి వస్తుంది. మన జిల్లాలో చాలా ప్రాంతాల్లో వీటిని పెంచుతున్నారు.



ఔషధ మొక్కలకు మంచి డిమాండ్..

మా నర్సరీలో దాదాపు 120 రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్యపరంగా మేలు చేసే ఎన్నో మొక్కలు అరుదుగా లభ్యమవుతాయి. దేశంలోని పలు ప్రాంతాల నుంచి వీటిని తీసుకొచ్చి జిల్లా వాసులకు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇంటీరియర్ మొక్కలు జేడ్, బోన్సాయ్, ఆర్‌కే ఫామ్స్, ఎల్నోనియా, త్రిఫిక్, రిబ్బన్‌పీస్ ఇలా పలు రకాలు నర్సరీలో ఉన్నాయి. ప్రధానంగా డ్రాగన్ ఫ్రూట్‌ను విక్రయిస్తాం. వీటి మొక్కలను ఉభయ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లోని నర్సరీలకు, రైతులకు అందిస్తున్నాం. వీటితో పాటు, ఉద్యానవన సాగుకు అవసరమైన మొక్కలు ఉన్నాయి. సేలం, కోయంబత్తూర్, పుణె, కడియం తదితర ప్రాంతాల నుంచి మొక్కలను ఎక్కువగా తీసుకొస్తాం.

– శెట్టెం శ్రీనివాసరావు, శ్రీ శివసాయి నర్సరీ, ఒంగోలు

బైక్‌ల చోరీ ముఠా అరెస్ట్

● 6 వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వంశీధర్‌గౌడ్

బద్వేలు అర్బన్: జల్సాలకు అలవాటు పడి వివిధ ప్రాంతాల్లో బైక్‌ల చోరీ చేస్తున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను బి.కోడూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4.50 లక్షల విలువ చేసే 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బద్వేలులోని డీఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన రసూల్, హనుమంతునిపాడు మండలం మహమ్మదాపురం గ్రామానికి చెందిన గుడిమెట్ల సుబ్బయ్య అలియాస్ చిన్నోడు, పల్నాడు జిల్లా బొర్లపల్లి మండలం యల్లటూరు గ్రామానికి చెందిన మన్నేపల్లి సాయికుమార్, కడప నగరం చిన్నచౌకు ఏరియాలోని గౌస్‌నగర్‌కు చెందిన సయ్యద్‌ఖలీల్ అనే యువకులు బేల్దారి పనులు చేసుకుంటూ దురలవాట్లకు లోనై.. గతంలో నేర నేపథ్యం ఉన్న సాయికుమార్ ప్రేరణతో ముఠాగా ఏర్పడి బైకులు చోరీ చేయడం ప్రారంభించారు. గడిచిన ఆరు నెలల్లో పల్నాడు, ప్రకాశం, కడప జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ రాత్రి సమయంలో ఇంటి ముందు నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు. మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని మైదుకూరు టౌన్‌లో రెండు, బద్వేలు టౌన్‌లో ఒకటి, బి.కోడూరు మండలంలో ఒకటి, కడపలో ఒకటి, పల్నాడు జిల్లా వినుకొండలో ఒక బైక్ చొప్పున మొత్తం 6 వాహనాలను అపహరించారు. బి.కోడూరులో బైక్ చోరీ కేసును దర్యాప్తు చేస్తున్న ఇన్‌చార్జి ఎస్సై చంద్రశేఖర్, సబ్ డివిజన్ క్రైం పార్టీ బృందం అనుమానితులపై నిఘా ఉంచగా.. వారు కడప నుంచి ప్రకాశం జిల్లా వైపు వెళ్తున్నట్లు సమాచారం అందింది. దీంతో బి.కోడూరు మండలం ఎర్రిఓబన్నబావి వద్ద నిందితులను అరెస్టు చేసి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన బద్వేలు రూరల్ సీఐ సుదర్శన్‌ప్రసాద్, బి.కోడూరు ఇన్‌చార్జి ఎస్ఐ చంద్రశేఖర్, సబ్ డివిజన్ క్రైంపార్టీ ఏఎస్ఐలు రాంభూపాల్‌రెడ్డి, నాగేంద్ర, కానిస్టేబుళ్లు అమరేశ్వర్‌రెడ్డి, శివ, సిద్దారెడ్డి, ఖాజా, ఇతర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం రూరల్: రైతులు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. సోమవారం మార్కాపురం మార్కెట్ యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. రైతులు పత్తిని నేరుగా యార్డులో అమ్ముకుంటే మంచి ధర వస్తుందని, దళారుల బారినపడి మోసపోవద్దని చెప్పారు. యార్డు సెక్రటరీ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. బన్నీ రకం పత్తి కనీస మద్దతు ధర రూ.7020కు, 8 శాతం తేమ ఉండాలని తెలిపారు. 9 శాతం తేమ ఉంటే రూ.6949, 10 శాతం తేమ ఉంటే రూ.6,879.60 కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. పింజ పొడవు, మైక్రో నైర్‌ను బట్టి కనీస మద్దతు ధర ఉంటుందన్నారు. యార్డుకు పత్తి తెచ్చే రైతులు ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతా వివరాలు తీసుకురావాలని సూచించారు. పత్తి పైన నీళ్లు చల్లవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కృష్ణ, వైస్ చైర్మన్లు ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లికార్జునరావు, డైరెక్టర్‌లు రమణారెడ్డి, లయోలా చెంచిరెడ్డి, ఉత్తమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా విధులు నిర్వహిస్తాం



పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రమాణం చేయిస్తున్న ఏఎస్పీ శ్రీధర్‌రావు



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

● కలెక్టరేట్, డీపీఓలో అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ

ఒంగోలు టౌన్: అవినీతికి దూరంగా ఉంటామని, నీతి, నిజాయితీతో జీవిస్తామని పోలీసు అధికారులు, డీపీఓ సిబ్బందితో ఏఎస్పీ(క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాయలంలో నీతి నిజాయితీ ప్రతిజ్ఞ చేశారు. దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రగతికి అవరోధంగా మారిన అవినీతిని నిర్మూలించడంలో భాగంగా నైతిక ప్రమాణాలకు కట్టుబడి విధులు నిర్వహిస్తామని, పరిపాలనలో పారదర్శకంగా బాధ్యతాయుతంగా కర్తవ్యాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీపీఓ ఏఓ సులోచన, డీసీఆర్బీ సీఐ ధర్మేంద్ర బాబు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ఎస్సీఎస్టీ సీఐ కె.అజయ్‌కుమార్, ఆర్‌ఐ హరిబాబు, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ

ఒంగోలు అర్బన్: బాధ్యతాయుతంగా ఉంటూ నీతి నిజాయితీతో విధులు నిర్వహిస్తామని కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది సోమవారం ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్, ఏసీబీ శాఖ ఆదేశాల మేరకు కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌డీసీ లోకేశ్వరరావు, సూపరింటెండెంట్లు రవి, రాజ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

గోడౌన్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

● కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు సెంట్రల్: రైతుల అవసరాలు, పీఏసీఎస్ పరపతేతర వ్యాపార అభివృద్ధి కోసం సహకార శాఖ ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్(ఎంపీఎఫ్‌సీ) గోడౌన్లను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఎంపీఎఫ్‌సీ గోడౌన్ల నిర్మాణ పురోగతిపై సోమవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఫేజ్–1లో నిర్మిస్తున్న 13 గోడౌన్లలో తొమ్మిదింటిని నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని, మిగిలిన వాటిని డిసెంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గోడౌన్ల నిర్మాణం పూర్తయిన తర్వాత వాటి వినియోగం, సంఘ ఆర్థిక లబ్ధికి చేపట్టాల్సిన కార్యాచరణపై డీసీఓ, మార్కెటింగ్ ఏడీ, సీఈఓ, పీఏసీసీలు సమష్టిగా చర్చించి నివేదిక సమర్పించాలని సూచించారు. సీఈఓలకు పీఏసీసీ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లా సహకార శాఖ అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

శభాష్ ప్రశాంత్

● తైక్వాండోలో పోలీసు అమరవీరుని కుమారుడి ప్రతిభ
● అభినందించిన ఎస్పీ మలికా గర్గ్



ప్రశాంత్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధిస్తున్న పోలీసు అమరవీరుడు మోటా ఆంజనేయులు కుమారుడు ప్రశాంత్‌ను ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాయలంలో ప్రశాంత్‌ను ఘనంగా సన్మానించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ప్రశాంత్ తండ్రి ఆంజనేయులు స్వగ్రామం కొండపి మండలం పెరిదేపి. జూనియర్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన 2008లో ఏఓబీ సరిహద్దుల్లో మావోయిస్టులతో పోరాడుతూ అమరుడయ్యారు. ప్రశాంత్ సౌత్ ఇండియా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో 8 పతకాలు సాధించి నేషనల్ తైక్వాండో ఫెడరేషన్ యూనియన్ నుంచి ఫస్ట్ డన్ సర్టిఫికెట్ పొందాడు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 19 ఏళ్ల చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలతోపాటు చదువులలోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఆర్‌ఐ హరిబాబు, ప్రశాంత్ తల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 145 ఫిర్యాదులు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు మొత్తం 145 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ వారితో ముఖాముఖి మాట్లాడారు. సమస్య పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలో విచారణ చేపట్టి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి స్పందన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న స్పందనలో వచ్చే ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ చెప్పారు.

☛ ఒంగోలుకు చెందిన సల్మా అనే మహిళ మరో వ్యక్తితో కలిసి తనకు వీఆర్వో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.పది లక్షలు తీసుకుని మోసం చేశారని నగరానికి చెందిన ఒక వ్యక్తి ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేశారు.

☛ ఒంగోలు హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న తన ఇంటిని అద్దెకు తీసుకున్న టి.సుమన్ అద్దె సరిగా చెల్లించడం లేదని, ఖాళీ చేయకుండా బెదిరిస్తున్నాడని కొణిజేడుకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ(క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాసరావు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విశిష్ట గాయని
రావు బాలసరస్వతీదేవి
వైఎస్సార్
జీవన సాఫల్య పురస్కారం
అందుకోనున్న
సందర్భంగా...

గాన సరస్వతి

పువ్వుకు రాగం అబ్బితే ఎలా ఉంటుంది?
ఆ పువ్వు స్వరాన్ని ఎలా సవరించుకుంటుంది?
ఆ తావి గానాన్ని ఎలా శ్రుతి చేసుకుంటుంది?
అక్షరాలను పూలరెక్కల్లా పొదివి పట్టుకుంటుంది.
సరిగమలు కందకుండా సున్నితంగా గానం చేస్తుంది.
ఆ గాన సరస్వతి... మన రావు బాలసరస్వతీదేవి.

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాల సరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గానసరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్ప లేదు. తొంభై ఏళ్లుగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. పారిజాత పువ్వులాంటి మృదుత్వం ఆమె రాగానిది. ఆ గొంతు సన్నజాజి మొగ్గలా పరిమళం వెదజల్లుతోంది ప్పటికీ. ఆ సుమధుర గానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తోంది. నవంబర్ ఒకటవ తేదీన (రేపు) ఆమె వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.



• పాట రికార్డింగ్ సమయంలో ఆరేళ్ల బాల సరస్వతీదేవి

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

సరస్వతి నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్‌ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతాలు సాధన చేసింది. సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలుకెళ్లడం కుదరకపోవడంతో ఆమె చదువు కోసం ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషాపరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోదసాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి ఈ రోజుల్లో పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో ఆమె తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే ఆశ్చర్యంగా జారి పడడంతో విరిగిన తుంటి ఎముక దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఇప్పటికీ రోజూ ఆ స్వరం రాగాలను పలుకుతుంటుంది. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.



• భర్త, పిల్లలతో బాలసరస్వతీ దేవి

పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు) లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోడలిగా కోలంక జమీందారీలో అడుగుపెట్టారు. ప్రకృతి ఇద్దరు వ్యక్తులను దూరం చేసిన విషాదాంతాలను సినిమాల్లో చూస్తుంటాం. కానీ ప్రకృతి ఇద్దరు మనుషులను దగ్గర చేయాలనుకుంటే చాలా చమత్కారంగా దగ్గర చేస్తుంది. అందుకు ఈ గానసరస్వతి పెళ్లే గొప్ప ఉదాహరణ. ''నా పాటను విన డానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతీ దేవికి హాఫ్ వైట్ పట్టు చీరలిష్టం. క్రీమ్ కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెపూలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్న పిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసి పిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి. భోజనం గుప్పెడే కానీ, ఆ వెంటనే స్వీట్ తినడం ఆమెకిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు, మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంభై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతీదేవి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. కోడలు అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే ఆమె పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోహనాచారి

మల్టీ టాలెంట్



• బిజినెస్ లీడర్‌గా...

తేజో చంద్రిక

ఆరోజు...
'అలాగే' అని తల ఆడించి ఉంటే 'పవర్ ఫుల్ ఉమన్'గా ప్రపంచ వ్యాప్తంగా చంద్రిక పేరు తెచ్చుకునేది కాదు.
'ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ఈ ఊళ్లో ఒక్కరోజు కూడా ఉండలేను' అని భయపడి ఉండే ఉద్యోగజీవితంలోకి వచ్చేది కాదు. తనను తాను నిరూపించుకునేది కాదు.
'లాయర్ కావాలనుకున్నాను. ఈ ఉద్యోగం ఏమిటి' అని నిట్టూర్చి ఉంటే చంద్రిక కొత్త శిఖరాలు అధిరోహించేది కాదు.
'ఉద్యోగ జీవితానికే టైమ్ లేదు. ఇక సంగీతానికి స్థానం ఎక్కడ' అని సర్దుకుపోయి ఉంటే సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకునేది కాదు. ప్రపంచ గుర్తింపు పొందిన బిజినెస్ లీడర్, గ్రామీ–నామినేట్ ఆర్టిస్ట్‌గా, దాతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది చంద్రిక....

'అవసరం లేదు' ఒక మాటలో తేల్చేసింది అమ్మ. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీలో చేరాలనుకుంటున్న చంద్రికకు ఆ మాట శరాఘాతం అయింది. 'ఆ కాలేజీలో తక్కువమంది మాత్రమే అమ్మాయిలు ఉన్నారు. అంతా అబ్బాయిలే' అన్నది అమ్మ. చంద్రిక చాలా సేపు అమ్మతో వాదించినా ఫలితం కనిపించలేదు.

ఇంట్లోనే నిరాహార దీక్ష చేసింది. దీంతో చంద్రిక మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదవడానికి తల్లి ఒప్పుకోక తప్పింది కాదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం చంద్రిక జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. సంగీతప్రపంచంతో అనుబంధానికి, సింగర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది.

డిగ్రీలో చేరడమే కష్టం అనుకున్న చంద్రిక ఆ తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ చేరడం పెద్ద విజయం. నిజానికి చంద్రికకు బిజినెస్ ప్రపంచంపై పెద్దగా ఆసక్తి లేదు. తాతలాగే లాయర్ కావాలనుకుంది. అయితే ప్రొఫెసర్ స్వామినాథన్ సూచన మేరకు బిజినెస్ స్కూల్‌లో చేరింది. మొదటి కొన్నిరోజులు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే సొంత ఊరు దాటి అంత దూరం రావడం అదే మొదటిసారి.

ఆ ఒంటరితనానికి దూరం కావడానికి సంగీతానికి దగ్గరైంది. చంద్రిక తొలి ఉద్యోగం సిటీబ్యాంక్‌లో. బ్యాంకర్ కావాలని కలలో కూడా అనుకోని చంద్రికకు ఇది వింతగా అనిపించింది. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం లెబనాన్‌లోని బీరుట్ వెళ్లింది.



• సుమధుర గాయనిగా...

యుద్ధానికి సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కడకు వెళ్లింది. అక్కడ అయిదు నెలల పాటు ఉంది. సిటీబ్యాంక్ తరువాత వేరే సంస్థల నుంచి చంద్రికకు అవకాశాలు రావడం మొదలైంది. అలా అమెరికాలోకి అడుగు పెట్టింది. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన సంగీతప్రపంచాన్ని మాత్రం చంద్రిక విడిచి బయటికి రాలేదు. ఎన్నో ఆల్బమ్స్ ద్వారా సక్సెస్‌ఫుల్ మ్యూజిషియన్‌గా తనను తాను నిరూపించుకుంది. సెకండ్ ఆల్బమ్ 'సోల్ కాల్' గ్రామీ అవార్డ్–బెస్ట్ కాంటెంపరరీ వరల్డ్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో నామినేట్ అయింది.

గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మకెంజీకి ఫస్ట్ ఇండియన్ ఉమెన్ పార్ట్‌నర్‌గా అరుదైన ఘనత సాధించింది. అడ్వైజరీ సంస్థ 'టాండన్ క్యాపిటల్స్ అసోసియేషన్స్' ప్రారంభించి సూపర్ సక్సెస్ అయింది.

ఈ ప్రయాణంలో చంద్రికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కుటుంబజీవితం, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కూడా అందులో ఒకటి. అయితే ప్రతి సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లింది. సవాలు ముందుకు వచ్చినా, ఒత్తిడి తలలో దూరినా తన దగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం సంగీతం. పాటలు వినడం, పాడడం తనకు ఎంతో ఇష్టం. అదే తన బలం. తాజాగా 'అమ్మాస్ ట్రెజరర్స్' ఆల్బమ్‌తో ముందుకు వచ్చింది చంద్రిక. ఇది పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆల్బమ్.

- బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పెంపకంతో రైతులకు ఆదాయం, పర్యావరణానికి మేలు
- సేంద్రియ వ్యర్థాలను ప్రొటీన్లతో కూడిన ఆహారంగా మార్చుతున్న బ్లాక్ సోల్జర్ ఈగలు
- బిఎస్ఎఫ్ లార్వాలు (పిల్ల పురుగులు) కోళ్లకు, చేపలు, రొయ్యలకు, పెంపుడు కుక్కలకు భేషైన పౌష్టికాహారం
- 30 రోజులకో బ్యాచ్ చొప్పున బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ఇంటిపట్టునే సులువుగా పెంచవచ్చు
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకంలో ఉప ఉత్పత్తిగా వెలువడే సేంద్రియ ఎరువుతో అదనపు ఆదాయం
- దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో ఐసిఎఆర్ ఎన్ఎహెచ్ఇపి ప్రాజెక్టు ద్వారా పైలెట్ యూనిట్ ఏర్పాటు
- శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు శిక్షణ ఇవ్వనున్న పిజెటిఎస్ఎయు

సాగుబడి
స్వాతి కార్తె:
నవంబర్ 6 వరకు

బ్లాక్ సోల్జర్ ఈగలతో ప్రొటీన్ల సేద్యం!



సేంద్రియ వ్యర్థాలను ఆహారంగా తిని పెరిగే బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగు(లార్వా)లు కోళ్లతో పాటు చేపలు, రొయ్యలకు మంచి ప్రొటీన్లతో కూడిన మేతగా ఉపయోగపడుతున్నాయి. విదేశాల్లో విస్తారంగా జరుగుతున్న బిఎస్ఎఫ్ లార్వా సాగు ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ వ్యాపిస్తోంది. కుళ్లిన పండ్లు, కూరగాయలు, వంటింట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలను తిని ఈ పిల్ల పురుగులు దాదాపు నెల రోజుల్లోనే పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బిఎస్ఎఫ్‌పై పరిశోధనలు మన దేశంలో శైశవ దశలో ఉన్నాయి. ఐసిఎఆర్ గ్రాంటుతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజెటిఎస్ఎయు) ఏడాది క్రితమే వేస్ట్2వెల్త్ ప్రాజెక్టులో భాగంగా దీనిపై పరిశోధనలు చేపట్టింది. అంతేకాదు, శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతుల శిక్షణకు ఇటీవలే శ్రీకారం చుట్టింది. ఇన్నోవేటివ్ ఇన్‌సెక్ట్ ఫార్మింగ్ వివరాలతో ఆసక్తికర కథనం...

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన శాకాహార, మాంసాహారోత్పత్తుల్లో 60% మాత్రమే వినియోగమవుతోంది. పొలంలో 8%, మార్కెట్‌కు వెళ్లే దారిలో 14%, రిటైల్ అమ్మకందారుల వద్ద 7%, ఇళ్లలో వినియోగానికి ముందు 11% మేరకు ఆహారం వృథా అవుతోంది. 2021 యుఎన్ఇపి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ ప్రకారం మన దేశంలో ఏటా 6.88 కోట్ల టన్నుల ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈ సేంద్రియ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేసే కంటే పునర్వినియోగించి ప్రయోజనం పొందటం తెలివైన పని. ఈ పనిని ఇతర పురుగుల కన్నా బ్లాక్ సోల్జర్ ఈగలు (బిఎస్ఎఫ్) సమర్థవంతంగా చేయగలవన్నది నిపుణుల మాట.

పురుగుల సేద్యం చాలా వినూత్నమైనది, పర్యావరణ హితమైనది, ఆదాయాన్ని అందించేది కూడా. మన దేశంలో కొందరు వ్యాపారవేత్తలు, కోళ్ల రైతులు బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగుల(లార్వా)ను సాగు చేయటం ఇటీవల ప్రారంభించారు. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల ఉత్పత్తి కాలం వాటికి వేసే ఆహారాన్ని బట్టి మారుతుంది. ఒక బ్యాచ్ 20 రోజుల నుంచి 40 రోజుల వరకు పడుతుంది. ఆహారం మెత్తగా, త్వరగా జీర్ణించుకునే విధంగా ఉండి ప్రొటీన్లతో కూడి ఉన్నప్పుడు తక్కువ రోజుల్లోనే పురుగులు పెరుగుతాయి.

లేయర్ కోళ్ల ఫారాల్లో ఇనుప కేజీల కింద పోగుపడే కోళ్ల పెంటపై బిఎస్ఎఫ్ ఈగల 5 రోజుల పిల్లలను వదిలితే చాలు.. ఆ వ్యర్థాలనే ఆహారంగా తింటూ 25–30 రోజుల్లోనే పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి.

బిఎస్ఎఫ్ పెంపకం ద్వారా సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లో 70–80% మేరకు కుదించవచ్చు. అందువల్లనే నగరాలు, పట్టణాల్లో పోగుపడే సేంద్రియ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఇవి ఉపయోగపడుతున్నాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) చెబుతోంది. బిఎస్ఎఫ్ లార్వా(పిల్ల పురుగులు) బరువులో 40–45% వరకు ప్రొటీన్లు ఉన్నాయి. అందువల్ల కోళ్ల మేతలో, ఆక్వా మేతల తయారీలో సోయా చిక్కుళ్లు, ఫిష్ మీల్‌తో పాటుగా 10 శాతం వరకు బిఎస్ఎఫ్ పురుగుల పొడిని కలుపుతున్నారు. బతికి ఉన్న పిల్ల పురుగుల (వెట్ లార్వా)ను కోళ్లకు నేరుగా మేతగా వేస్తున్నారు. రోజువారీ మేతలో పది శాతం వరకు ఈ పిల్ల పురుగులను అందిస్తూ సత్ఫలితాలు పొందుతున్న కోళ్ల ఫారాలు తెలుగు నాట ఇప్పటికే అనేకం ఉన్నాయి.



• బ్లాక్ సోల్జర్ ఫ్లై గుడ్లు



• 5 రోజుల వయసులో పిల్ల పురుగులు



• గ్రాములో 3 వేల పిల్ల పురుగులు



• కూరగాయ వ్యర్థాలు, చద్దన్నం, గోధుమ తవుడు మిశ్రమం



• ఆ మిశ్రమమే పురుగులకు ఆహారం



• 15–25 రోజుల్లో లార్వా సిద్ధం. ప్యూపా దశకు ముందే ఈ పురుగులను వాడుకోవాలి

పిజెటిఎస్ఎయులో పైలెట్ ప్రాజెక్టు

అయితే, మన దేశంలో దీనిపై పరిశోధనలు ఇంకా శైశవ దశలోనే ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు) ఈ దిశగా ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిగా బిఎస్ఎఫ్ పెంపకంపై పరిశోధన చేపట్టింది. నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 'వేస్ట్2వెల్త్' ప్రాజెక్టును మంజూరు పిజెటిఎస్ఎయుకు గత ఏడాది చేసింది. పిజెటిఎస్ఎయు పీజీ స్టడీస్ డీన్, కీటక శాస్త్ర ఆచార్యులు డా. వి. అనిత ఈ ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆవరణలో బ్లాక్ సోల్జర్ ఫ్లైల పెంపకం కమ్ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, మెస్‌లో మిగిలిన అన్నం, గోధుమ తవుడు మిశ్రమంతో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు పెంచుతున్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తల మొదటి బ్యాచ్‌కు డా. అనిత ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు డా. అనిత 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. నగరాలు, పట్టణాల్లో వెలువడే సేంద్రియ ఆహార వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించడానికి, పనిలో పనిగా మంచి ప్రొటీన్‌ను అందుబాటులోకి తెచ్చుకోవడానికి బిఎస్ఎఫ్ లార్వాల పెంపకం ఉపయోగకరం. అన్నిటికీ మించి, సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లోనే 70–80% మేరకు తగ్గించేంత ఆబగా తినగల శక్తి బిఎస్ఎఫ్ జాతికి వుంది. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి మన దేశపు వాతావరణం చాలా అనువైనదంటున్నారు డా.అనిత.



• బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను వర్టికల్ టవర్‌లో ట్రేలలో పెంచవచ్చని చెబుతున్న డా. వి. అనిత

ఎంటర్‌ప్రెన్యూర్లకు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం

బ్లాక్ సోల్జర్ ఈగలు మనకు కొత్తవి కావు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దం నుంచి ఉన్నదే ఈ జాతి. కొత్త తెగుళ్లు వ్యాప్తి చెందుతాయన్న భయం లేదు. ఆహార వ్యర్థాలు, పశువుల విసర్జితాలను సాధ్యమైనంత మెత్తగా చేసి, సులభంగా జీర్ణించుకునేలా మార్చి ఈ పురుగులకు వేయాలి. అందులో ప్రొటీన్లు ఉండాలి. చిన్న పిల్లల ఆహారం లాగా ఉండాలి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను సేకరించి, మెత్తగా రుబ్బి.. దానితో పాటు మెస్‌లో మిగిలిపోయిన అన్నం, గోధుమ తవుడు కొంచెం కలిపి మా ప్రయోగశాలలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను పెంచుతున్నాం. వాటికి వేసే ఆహారాన్ని బట్టి, దానిలో పోషక విలువలను బట్టి, వాతావరణంలో వేడి, గాలిలో తేమను బట్టి.. అవి ఎన్ని రోజుల్లో, ఎంత బరువు పెరుగుతాయన్న విషయం ఆధారపడి ఉంటుంది. సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకునే మార్గం ఇది. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మంచి ఆదాయమూ సమకూరుతుంది. రైతులకు, ఎంటర్‌ప్రెన్యూర్లకు శిక్షణ ఇస్తున్నాం.

– **డా. వి. అనిత,** కీటక శాస్త్ర ఆచార్యులు, పీజీ స్టడీస్ డీన్, బ్లాక్ సోల్జర్ ఫ్లై ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, పిజెటిఎస్ఎయు, హైదరాబాద్. మొబైల్: 94402 58050

బిఎస్ఎఫ్ ప్రత్యేకతలు

సేంద్రియ వ్యర్థాలను తినే అనేక జీవులుండగా బ్లాక్ సోల్జర్ ఫ్లైలనే ఎందుకు ఎంపిక చేసినట్లు? ఇదే ప్రశ్న డా. అనితను అడిగితే ఇలా బదులిచ్చారు...

- రోజుకు తన బరువుకు రెట్టింపు సేంద్రియ వ్యర్థాలను తిని, సేంద్రియ ఎరువును విసర్జించగల శక్తి బిఎస్ఎఫ్ పిల్ల పురుగులకు ఉంది. దీని అర్థం ఏమిటంటే.. చెత్త కుప్పలకు తరలివెళ్లే సేంద్రియ వ్యర్థాలు తగ్గిపోతాయి. మిథేన్ ఉద్గారాలు ఆ మేరకు తగ్గుతాయి.
- కుళ్లిన పండ్లు/కూరగాయలు,హోటళ్లు/ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలు వంటి సేంద్రియ వ్యర్థాలను బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి వాడొచ్చు.
- బిఎస్ఎఫ్ జీవిత చక్రం మొత్తం 42–55 రోజులు. గుడ్లు పెట్టిన 4–5 రోజులకు పిగులుతాయి. అవి 15–25 రోజుల్లో పిల్ల పురుగులా(లార్వా)గా ఎదుగుతాయి. ఈ దశలోనే వాటిని సేకరించి కోళ్లు, ఆక్వా మేతల్లో వాడుతున్నారు. అలాగే ఉంచితే, ప్యూపాగా రూపాంతరం చెంది, 17 రోజుల తర్వాత బ్లాక్ సోల్జర్ ఈగలు పుడతాయి. మగ ఈగ 4 రోజుల్లో ఆడ ఈగను కలిసిన తర్వాత చనిపోతుంది. ఆడ ఈగ 5–8 రోజుల్లో గుడ్లు పెట్టి చనిపోతుంది.
- గుడ్లను సేకరించి, అతి చిన్న పురుగులను తయారు చేయట కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 5 రోజుల పిల్లలకు తగిన సేంద్రియ ఆహారం అందిస్తే 15–25 రోజుల్లో పిల్ల పురుగులు(లార్వా)గా పెరుగుతాయి. ఆ దశలో చక్కని ప్రొటీన్లతో కూడిన ఆ పిల్ల పురుగులు కోళ్లు, చేపలు, రొయ్యలకు మేతగా వాడుకోవచ్చు.
- 5 రోజుల పిల్లలను కొనుక్కొని రైతులు 15–25 రోజుల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను లార్వా దశకు పెంచి, కోళ్లకు, చేపలు, రొయ్యలకు మేతగా వేసుకోవచ్చు లేదా కొనుగోలుదారులకు అమ్ముకోవచ్చు. స్వయం ఉపాధిగా యువకులు బిఎస్ఎఫ్ లార్వా సాగు చేపట్టవచ్చు. ఈ లార్వాను దాణా తయారీ కంపెనీలు, సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. లార్వా దశ దాటి ప్యూపా దశకు పెరిగితే దాణాల్లో వాడకానికి పనికిరాదు.
- సోయా చిక్కుళ్ల సాగులో సమస్యలు, సముద్రాల్లో చేపల సంతతి తగ్గిపోతుండటం వల్ల కోళ్లు, ఆక్వా మేతలతో పాటు, పెంపకపు కుక్కల మేతల్లో కూడా బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ప్రొటీన్ సప్లిమెంట్‌గా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్నారు. దీంతో బిఎస్ఎఫ్ లార్వా సాగుకు డిమాండ్ పెరుగుతోంది.
- ఈ పిల్ల పురుగులే అధిక నాణ్యత గల ప్రొటీన్లతో కూడిన దాణాకు ముడి పదార్థం. కోళ్లు, చేపలు, రొయ్యలు, పందులు, పెంపుడు కుక్కలకు వేసే మేతలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని కలపవచ్చు. పిల్ల పురుగుల బరువులో 40–45% ప్రొటీన్‌తో పాటు ఎసెన్షియల్ అమినో యాసిడ్లు ఉంటాయి. సాధారణంగా మేతల్లో ప్రొటీన్లుగా వాడే సోయా చిక్కుడు గింజలు, ఫిష్‌మీల్‌ను కొంత తగ్గించి దీన్ని వాడుతున్నారు.
- కోళ్లకు రోజువారీ మేతలో పది శాతం మేరకు దీన్ని వాడుతున్నారు. పిల్ల పురుగులను బతికి ఉన్నప్పుడే ఫారం కోళ్లకు మేపవచ్చు. నాటు కోళ్లకూ ఇది మంచి ఆహారం.
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకం క్రమంలో వెలువడే విసర్జితాలే(ఫ్రాస్) పంటలకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువుగా పనికి వస్తుంది. వర్మీకంపోస్టు, పశువుల ఎరువుల్లో కంటే అధిక పోషక విలువలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు.
- విదేశాల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని బర్గర్లు, షేక్‌లలో కలుపుతున్నారు. దీని నుంచి వెలికితీసే నూనెను బయో ఇంధనంగా వాహనాలు, జనరేటర్లలో వాడుతున్నారు. బిఎస్ఎఫ్ లార్వా నుంచి వెలువడే పొలుసులు(కూటిన్) బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్లాస్టిక్ తయారీకి వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలున్నందున వైద్య అవసరాలకు కూడా వినియోగిస్తున్నారు.
- వర్షాకాలంలో దీపం చుట్టూ చేరే ఉసుళ్లను వేపుకొని శనగపప్పుతో కలుపుకొని తినే అలవాటు మన దేశంలోనూ ఉంది. బిఎస్ఎఫ్‌తో పాటు మిడతలు, మీల్ వార్మ్స్, గొల్లభామలు, వంటి 1,900 జాతుల పురుగులను 113 దేశాల్లో 200 కోట్ల మంది తింటున్నారని ఎఫ్ఎఓ చెబుతోంది.

పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్